ఈనాడు
నిర్మల్
శుక్రవారం అక్టోబరు 25, 2024

పోరుబాట.. అన్నదాతకు బాసట

● కేటీఆర్ సభతో భారాసలో ఉత్తేజం ● గుజరాత్ తరహాలో పత్తికి మద్దతు ధర ఇచ్చే వరకు పోరాడతామని వెల్లడి..



హాజరైన జనం



సభలో అభివాదం చేస్తున్న కేటీఆర్

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందంటూ.. భారాస ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణం రాంలీల మైదానంలో గురువారం నిర్వహించిన రైతు పోరు బాట సభ ఆ పార్టీలో ఉత్తేజం నింపింది. సభ కోసం ఆదిలాబాద్ నియోజకవర్గంలోని రైతులను, ప్రజలను ఎక్కువ సంఖ్యలో తరలించగా.. బోథ్ నియోజకవర్గ పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం తరలివచ్చారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఉదయం 11.30 గంటలకు హాజరవుతారని చెప్పడంతో అనుకున్న సమయానికి ముందే జనం అక్కడికి చేరుకున్నారు. మేడ్చల్‌లో ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడం, డిచ్‌పల్లి వద్ద రహదారిపై పోలీసు కుటుంబాల ఆందోళనకు మద్దతు ఇవ్వడం, మధ్యలో కార్యకర్తల సన్మానాలతో ఆయన మధ్యాహ్నం 1.30కు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఇదే విషయాన్ని సభలో వెల్లడించారు. ప్రజలు ఓపిగ్గా ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులు భూమారెడ్డి, జనార్దన్‌లు రుణమాఫీ, రైతు భరోసా ఆలస్యంపై రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి ఆలోచింపజేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే లక్ష్యంగా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఏ ఒక్క హామీని నెరవేర్చడం లేదని దుయ్యబట్టారు. జిల్లా కేంద్రంలో మూతపడ్డ సిమెంటు పరిశ్రమను పునరుద్ధరిస్తామని చెప్పి గెలుపొందిన భాజపాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యే ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. రాబోయే కాలంలో అదానికి సీసీఐని అమ్మేస్తారని పేర్కొన్నారు. సింగరేణిపైనా అదాని గురిపెట్టారని, సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు పూర్తి సహకారాలు అందిస్తున్నారని ఆరోపించారు.

మేం అధికారంలోకి వచ్చాక ఏకపక్షంగా వ్యవహరించే వారికి మిత్తితో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. జిల్లాలో ఇలా వ్యవహరించే అధికారులు, పోలీసుల పేర్లు రాసుకోవాలని జోగురామన్నకు సూచించారు.

ఆదిలాబాద్‌లో నాణ్యమైన పత్తి

గుజరాత్‌లో పత్తికి క్వింటాలుకు రూ.8,800 ఇస్తే ఆదిలాబాద్‌లో మాత్రం అదే భారత పత్తి సంస్థ తక్కువ ధర ఇవ్వడం విడ్డూరమంటూ కేటీఆర్ దుయ్యబట్టారు. ఆదిలాబాద్ పత్తి రైతులకు గుజరాత్ తరహాలో ధర లభించే వరకు పోరాడుతూనే ఉంటామని, భాజపాకు చెందిన స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేను ప్రశ్నిస్తూనే ఉంటామని భరోసా ఇచ్చారు.

కార్యకర్తలంతా రైతుల కల్లాల దగ్గరకు వెళ్లి అండగా ఉండాలని పిలుపునిచ్చారు.

సమంజసం కాదు..

రుణమాఫీ కాలేదని తలమడుగు మండలం రుయ్యాడిలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తే రైతులపై కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమంటూ కేటీఆర్ ప్రశ్నించారు. హైడ్రా పేరిట ఆదిలాబాద్‌లోని ఖానాపూర్ చెరువు వద్ద ఇళ్లు కూలగొట్టేందుకు మార్కు వేసేందుకు వస్తే సీఎంను దూషించారని గంగన్న అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారన్నారు. మరి వంద రోజుల్లో పథకాలు అమలుచేస్తామని చెప్పి మోసగించిన సీఎంపై ఫిర్యాదు చేస్తే కేసు ఎందుకు నమోదు చేయడం లేదంటూ ప్రశ్నించారు.

అన్ని నియోజకవర్గాల్లో..

రైతులకు న్యాయం చేకూర్చేలా, భరోసా ఇచ్చేలా జోగురామన్న రైతు పోరు బాట కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పోరుబాటు ఉంటుందని వెల్లడించారు. కార్యాచరణ సిద్ధం చేయాలని వేదికపై ఉన్న వివిధ నియోజకవర్గాల నేతలకు కేటీఆర్ సూచించారు. భారాస జిల్లా అధ్యక్షుడు జోగురామన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బోథ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, కోవలక్ష్మి పాల్గొన్నారు. కేటీఆర్ వెంట హుజూరాబాద్, కోరుట్ల ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, సంజయ్‌లు సభకు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బాల్కసుమన్, జడ్పీ మాజీ ఛైర్మన్ రాఠోడ్ జనార్దన్, మున్సిపల్ ఛైర్మన్ ప్రేమేందర్, నాయకులు జాన్సన్ నాయక్, తుల శ్రీనివాస్, లోలంశ్యాంసుందర్, చారులత, రౌతు మనోహర్, సతీష్‌పవార్, మార్‌శెట్టి గోవర్ధన్, యూనుస్ అక్బానీ, అజయ్, సాజిదొద్దీన్, మనీషా, స్వరూప, మమత, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.



కేటీఆర్‌కు నాగలి బహూకరిస్తున్న నాయకులు, చిత్రంలో రామన్న, అనిల్‌జాదవ్, జనార్దన్ రాఠోడ్

నాపై ఎన్ని కేసులైనా పెట్టుకోండి

జోగు రామన్న, భారాస జిల్లా అధ్యక్షుడు

బేలలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారని నాపై కేసు పెట్టారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు. ఉట్నూర్‌లో కేటీఆర్‌పై కేసు నమోదుకాక ముందే హామీల అమలులో మోసగించిన సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశాను. ఫలితం లేదు.

అన్నదాతలకు అప్పు దొరకడం లేదు

అనిల్‌జాదవ్ బోథ్ ఎమ్మెల్యే

సీఎం రేవంత్‌రెడ్డి అంటేనే ఒక మాటల గారడి. వర్షాకాలం రైతుభరోసా ఇవ్వలేదు. అక్టోబరు వచ్చినా ఇంకో భరోసా ఖాతాలో జమకాలేదు. కేసీఆర్ హయాంలో రైతుబంధు వస్తుందనే ఉద్దేశంతో ఖర్చుల కోసం రైతులు షావుకారు వద్దకు వెళితే అప్పుదొరికేది. కాంగ్రెస్ హయాంలో అన్నదాతలకు అప్పు పుట్టడం లేదు.

గంటల తరబడి కరెంటు కోతలు

కోవలక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే

కాంగ్రెస్ హయాంలో ఏ వర్గానికి న్యాయం జరగడం లేదు. రైతు భరోసా, పింఛను సొమ్ము పెంచుతామని మోసం చేశారు. గంటల తరబడి కరెంటు కోతలు విధిస్తున్నారు. మరోపక్క ఉచిత కరెంటు అంటూనే ఎవరికి వర్తింపజేయడంలేదు. పది నెలలు కావొస్తున్నా ఎక్కడా రోడ్డుపని సైతం మొదలెట్టలేదు.

ధాన్యం కొనుగోళ్లలో సందేహాలా..?

నేడు జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి కిరణ్‌కుమార్‌తో ఈనాడు ఫోన్-ఇన్

నిర్మల్, న్యూస్‌టుడే : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ సారి దొడ్డు, సన్నరకాల ధాన్యం కొనుగోలు చేయడానికి వేర్వేరు కాంటాలు ఏర్పాటు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు, సన్న రకాలకు బోనస్, మద్దతు ధర, తేమ శాతం, రవాణా, ఖాతాల్లో డబ్బులు జమ, గన్నీ బ్యాగులు, ప్యాడీ క్లీనర్లు, తదితర సందేహాలను నివృత్తి చేయడానికి జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి కిరణ్ కుమార్‌తో 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ఫోన్-ఇన్' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

సమయం : శుక్రవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు 80085 73598

రాయితీపై శనగ విత్తనాలు

కుంటాల: కుంటాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో యాసంగి సాగుకు సంబంధించి రాయితీ శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ అధ్యక్షుడు సట్ల గజ్జారాం తెలిపారు. 25 కిలోల బస్తా ధర రూ.2,250 ఉందన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకంతోపాటు ఆధార్ కార్డు నకలు ప్రతులతో కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని కోరారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్

నిర్మల్, న్యూస్‌టుడే : జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. పర్యాటక ప్రాంతాల్లో సౌకర్యాలు, సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. జిల్లాలోని ప్రసిద్ధ దేవాలయాలు, చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రదేశాలు, జలాశయాలు, జలపాతాలను మరింత అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. బాసర సరస్వతీదేవి, అడెల్లి పోచమ్మ, సదర్మాట్ బ్యారేజీ, స్వర్ణ, కడెం, గడ్డెన్నవాగు ప్రాజెక్టులను సందర్శించే పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. పర్యాటక ప్రాంతాలపై ఫొటో, డాక్యుమెంటరీ పోటీలను నిర్వహించాలన్నారు. అనంతరం బాసర సరస్వతీ ఆలయ అభివృద్ధిపై అధికారులతో చర్చించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మెరుగైన వసతులు కల్పించాలన్నారు. గోదావరి నది వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా, ప్రజలు నదిలోపలికి వెళ్లకుండా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసర సమయాల్లో భక్తులు సంప్రదించేలా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా అదనపు పాలనాధికారి (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, జిల్లా పర్యాటకశాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, సీపీవో జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ సి.వి.ఎన్.రాజు, బాసర ఆలయ ఈవో విజయరామారావు, ఈడీఎం నదీం, అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణను నిర్లక్ష్యం చేయొద్దు : ఆర్టీసీ డీఎం

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే : విధి నిర్వహణ సక్రమంగా చేపట్టాలంటే ఆరోగ్యం ఎంతో కీలకమని, అందుకే దాని విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం పనికిరాదని ఆర్టీసీ డీఎం ప్రతిమారెడ్డి అన్నారు. స్థానిక డిపో కార్యాలయంలో గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ నెల 29 వరకు కొనసాగే ఈ శిబిరంలో సంస్థ ఉద్యోగులకే కాకుండా వారి జీవిత భాగస్వామికి సైతం ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సహాయ మేనేజర్ రాజశేఖర్, కార్యాలయ పర్యవేక్షకుడు సంతోశ్‌కుమార్, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై విచారణ

లోకేశ్వరం, న్యూస్‌టుడే : మండలంలోని కన్కాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై గురువారం భైంసా ఆర్డీఓ కోమల్‌రెడ్డి గ్రామస్థులతో సమావేశమయ్యారు. దొడ్డు రకం ధాన్యం కోసం డీసీఎంఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా సన్న రకం ధాన్యం కోసం పీఏసీఎస్ వారికి కేంద్రాన్ని అప్పగించారు. అయితే గ్రామానికి చెందిన ఐకేపీ మహిళలు కొనుగోలు కేంద్రాన్ని తమకు అప్పగించాలని కోరడంతో ఆర్డీఓ గ్రామస్థులతో పాటు ఐకేపీ మహిళలతో సమావేశమై వివరాలు సేకరించారు. జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

పత్తి కొనుగోళ్లకు ఆధారే ప్రామాణికం

<u>నిర్మల్, న్యూస్‌టుడే :</u>

'జిల్లాలో పత్తి పంట కొనుగోళ్లు చేపట్టడానికి పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నాం. నిర్మల్, భైంసా, కుభీరు, సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయాల పరిధిలోని 17 జిన్నింగు మిల్లుల్లో సీసీఐ (భారత పత్తి సంస్థ) ద్వారా వచ్చే నెల మొదటి వారంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నాం. పత్తి కొనుగోళ్లకు రైతు ఆధార్ నంబరు ప్రామాణికం. అన్నదాతలు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేసుకోవాలి. పత్తి కొనుగోళ్లలో దళారుల ప్రమేయం లేకుండా రైతుకు సంబంధించి ఐరిస్ లేదా బయోమెట్రిక్ తీసుకుంటా'మని జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు.



జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్‌తో ముఖాముఖి

? జిల్లాలో ఎన్ని ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు

జిల్లాలో 1.40 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు అయ్యింది. గతేడాది కంటే ఈ సారి 7 వేల ఎకరాల విస్తీర్ణంలో అదనంగా సాగు చేస్తున్నారు. దాదాపు 10 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేసి అందుకు అనుగుణంగా భైంసాలో 12, నిర్మల్, కుభీరులలో రెండు, సారంగాపూర్‌లో ఒక జిన్నింగు మిల్లులో పత్తి కొనుగోళ్లు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం.

? రైతులకు మీరిచ్చే సూచనలేమిటి

పత్తి కొనుగోళ్లు ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యేవరకు ఒకే మద్దతు ధర ఉంటుంది. ఆరబెట్టి నాణ్యత ప్రమాణాలు ఉండే పత్తి పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి. సీసీఐ ద్వారా 8 నుంచి 12 శాతం తేమ ఉన్న పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తారు. క్వింటాలు పత్తికి మద్దతు ధర (8 శాతం తేమ ఉంటే) రూ.7,501 చెల్లిస్తారు. 9 శాతం ఉంటే క్వింటాలుకు రూ.75 తక్కువగా, 10 శాతం ఉంటే రూ.150, 11 శాతం ఉంటే రూ.225, 12 శాతం ఉంటే రూ.300 తక్కువగా రైతు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. 12 శాతం కంటే తేమ ఎక్కువగా ఉన్న పత్తిని కొనుగోలు చేయకుండా తిప్పి పంపిస్తారు.

? రైతులకు సమగ్ర సమాచారం తెలిపేందుకు ఏవైనా యాప్‌లు ఉన్నాయా

పత్తి పంట అమ్మే రైతుల కోసం వాట్సాప్ నెంబరు 88972 81111లో వివరాలు నమోదు చేస్తే క్షణాల్లో సమాచారం లభిస్తుంది. దీని ద్వారా పత్తి మద్దతు ధర, జిన్నింగు మిల్లుల వివరాలు, ఇతరత్రా సమాచారం తెలుసుకోవచ్చు. వీటితోపాటు పత్తి రైతు ఖాతాల సమాచారం తెలుసుకునేందుకు సీసీఐ 'కాటర్ అల్లై' యాప్ తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తోంది.

? జిల్లా సరిహద్దున మహారాష్ట్ర ప్రాంతం ఉండటంతో అక్కడి నుంచి పత్తి వచ్చే అవకాశం ఉంది. దీన్ని ఎలా కట్టడి చేస్తారు.

జిల్లాలోని రైతులు సాగుచేసిన పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తాం. జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు జిల్లా సరిహద్దులోని ముథోల్, బాసర, కుభీరు, కుంటాల, సారంగాపూర్ మండలాల పరిధిలో ఏడు తనిఖీ కేంద్రాలు (చెక్‌పోస్టులు) ఏర్పాటు చేస్తున్నాం. మహారాష్ట్ర నుంచి పత్తి రానీయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటారు.

? గతంలో జిన్నింగు మిల్లుల్లో తూకం యంత్రాల్లో తేడాలు రావడంతో రైతులు ఆందోళన చెందారు

పత్తి కొనుగోలు చేసే ప్రతి జిన్నింగు మిల్లులో తూకం యంత్రాలు సరిగా ఉన్నాయా లేదా అనే విషయమై ఇప్పటికే తూనికల, కొలతలశాఖ అధికారులు పరిశీలించారు. తూకం యంత్రాలు సరిగా పనిచేసేలా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం.

ఇక్కడా విజయం సాధించాలి..!!


పొన్నారిలో నూతన పశువైద్యాధికారిని సన్మానిస్తున్న గ్రామస్థులు

రాగానే స్వాగతం చెప్పారు చూడండి..

ఉమ్మడి జిల్లాలో 18 మంది పశువైద్యాధికారులు నియామక మయ్యారు. మామడ మండలం పొన్నారి పశువైద్యాధికారిగా శ్రేయార్ తాజాగా బాధ్యతలు స్వీకరించారు. పశువైద్య కళాశాలలో చదివి ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన తొలిరోజు ఆయనకు గ్రామస్థులు చక్కగా స్వాగతం పలికారు. పశుపోషణ అవసరాలను గుర్తించి మంచి సేవలందిస్తే జనాలతో మరింత అనుబంధం పెరుగుతుంది.

మామడ, న్యూస్‌టుడే: ఈ పోటీ ప్రపంచంలో ఎవరికైనా ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందంటే వారు ఎంతో ప్రతిభావంతులన్నట్లే. లక్ష్యం పెట్టుకొని ప్రణాళికతో చదివి తమ మేధస్సుతో ఇతరులకన్నా వేగంగా ముందుకెళ్లిన వారే అందరూ.. మూడు పదుల వయస్సుకు ముందే స్థిరమైన స్థానానికి చేరుకొని మంచి జీతంతో చక్కని జీవితాన్ని గడపొచ్చు. కళాశాల, తరగతి గది, శిక్షణ కేంద్రాలు, పుస్తకాలతో కుస్తీ పట్టి నిలిచిన దాటుకుంటూ వెళ్లిన వారు జనాల మధ్యకు వచ్చేశారు. ఇప్పుడు ఓ కొత్త జీవితాన్ని ప్రారంభించారు. పాఠాల్లో చదివిన అంశాలే ఇక్కడ ఉండవు. కొత్త బాధ్యతలు నిర్వర్తించాలి. అప్పుడప్పుడు సవాళ్లు ఉంటాయి. అంకితభావంతో పనిచేస్తే ఇక్కడా మీరు విజయం సాధించొచ్చు..

విసుక్కోకండి..

అక్షరాస్యులు, నిరక్షరాస్యులు, నాయకులు.. ఇలా ఎన్నో వర్గాలతో కలిసి పని చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు వ్యవసాయాధికారినే తీసుకుంటే మండలం మొత్తానికి అధికారి. ఆ ఒక్కరి పరిధిలో వేలాది మంది రైతులు ఉంటారు. అభిప్రాయాలు, [illegible], పంట సర్వేలు, పరిహారం చెల్లింపులు వంటి విషయాల్లో చాలా చురుకుగా పనిచేయాలి. ఈ క్రమంలో కొన్నిసార్లు ప్రతికూలతలు ఎదురవుతాయి. ఉద్యోగ సాధనలో కుంగుబాటుకు గురి కాకుండా ఆత్మవిశ్వాసంతో విజయం సాధించినట్లే ఇక్కడ మీ పనితనాన్ని చూపించాలి. ఎవరు ఎప్పుడు ఏ సమస్య చెప్పినా ఓపికగా వినాలి. విసుక్కోకుండా మనతో అయ్యే సాయాన్ని అందించాలి.



● ప్రతిభావంతులైన మీరు పనిమంతులవ్వాలి

గురువులుగా మీరు..


హిప్నెల్లి తండాలో విధులు నిర్వర్తిస్తున్న కొత్త ఉపాధ్యాయుడు సంపత్

కొత్త ఉద్యోగుల్లో ఉపాధ్యాయులే అధికం. ఎంతో కష్టపడి చదివి గురువులుగా మారిన వారు భావిభారత పౌరులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. అనుభవాలు. . ప్రతిభను రంగరించి విధి నిర్వహణలో అంకితభావం కనబరిస్తే శిష్యులు మంచి స్థానాలకు చేరుకుంటారు.

వీలైతే పనిచేసే చోట ఉండండి..

కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు ఉత్సాహంగా పనిచేయాలి. ఇందుకు మంచి అవకాశం పనిచేసే ప్రదేశంలో నివాసం ఉండటం. పట్టణాల్లో పుట్టి పెరిగిన వారు పల్లెటూరిలో నివాసం ఉండగలిగితే పల్లె ప్రజల ఆత్మీయతను చూరగొంటారు. సమయపాలన పాటించొచ్చు. వివాహమై కుటుంబ బాధ్యతలు పెరిగాక ఎలాగూ గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉండలేరు.

ఓ సామాజిక కార్యకర్తగా భావించాలి:



రైతులు, ప్రజలకు సేవ చేసే అవకాశం ఓ ప్రభుత్వ ఉద్యోగిగా కొందరికే దక్కుతుంది. ఉద్యోగాన్ని కేవలం ఉద్యోగంగా మాత్రమే కాకుండా అంకితభావంతో నిర్వర్తిస్తే వచ్చే గుర్తింపు ఉద్యోగ విరమణ పొందినా ఉంటుంది. సమాజం కోసం సామాజిక కార్యకర్తగా భావించి పనిచేయాలి. నా ఉద్యోగ నిర్వహణలో ఎన్నో ప్రాంతాల్లో పనిచేశాను. ఇప్పటికీ పనిచేసిన ప్రతి చోటు నుంచీ నాకు ఫోన్ చేస్తుంటారు. వారిచ్చే గౌరవం, చూపించే ప్రేమ ఎన్ని డబ్బులు పెట్టినా కొనలేం. కేవలం ప్రభుత్వ ప్రతినిధులుగా మనం వారికి చేసే సేవనే సంతృప్తినిస్తుంది. -అశోక్‌కుమార్, వ్యవసాయ శాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్

ఆ ఆనందమే వేరు..

మనీష, తానూరు మండల వ్యవసాయాధికారి

నేను మొదటి ఉద్యోగం మామడ మండలంలో ఏఈవోగా పనిచేశాను. తాజాగా ఏవోగా ఎంపికయ్యాను. క్షేత్ర స్థాయిలో రైతులకు అనేక ఇబ్బందులు ఉంటాయి. వారికి అందుబాటులో ఉండి అవసరమైన పనులు చేస్తే రైతుల కళ్లలో సంతోషం కనిపిస్తుంది. అప్పుడు కలిగే ఆనందాన్ని మాటల్లో చెప్పలేం. ఏదైనా మన పనితీరుతోనే గుర్తింపు లభిస్తుంది.


రైతుల వివరాలు సేకరిస్తూ..

పనిమంతులైతే గుండెల్లో నిలిచిపోతారు..

ఉపాధ్యాయులు, పశువైద్యాధికారులు, వ్యవసాయాధికారులు, ఏఈలు, ఎస్సైలు..ఇలా వివిధ హోదాల వారు కొత్తగా విధుల్లో చేరారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల్లో వెయ్యి మందికి పైగానే నూతన ఉద్యోగులు ఉన్నారు. ఇన్నాళ్లూ ఓ వ్యక్తిగా తన ఇష్టాలకు అనువుగా ఉండొచ్చు. ఇప్పుడు మాత్రం వ్యవస్థ కోసం పనిచేయాల్సి ఉంటుంది. ప్రతిభావంతులుగా గుర్తింపు తెచ్చుకున్న వారు పనిమంతులై ఉత్తమ ఉద్యోగులుగా రాణిస్తే జనాల గుండెల్లో నిలిచి పోతారు.

జనవరి నాటికి ఆర్మూర్ రైల్వే మార్గంపై తుది నివేదిక : ఎంపీ


సమావేశంలో పాల్గొన్న ఎంపీ నగేష్

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లావాసులు ఎదురుచూస్తున్న ఆదిలాబాద్ - ఆర్మూర్ వయా నిర్మల్ రైల్వే మార్గం సర్వే జరుగుతోందని, తుది నివేదికను జనవరి 25లోగా రైల్వేబోర్డుకు సమర్పించనున్నట్లు ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ వెల్లడించారు. ఆదిలాబాద్ వరకు పలు రైళ్ల పొడిగింపుతో పాటు ప్రధాన పుణ్యక్షేత్రం బాసరలో మరిన్ని రైళ్లు ఆగేలా నివేదించినట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో ఎంపీలతో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సమావేశం నిర్వహించారు. ఆయా అంశాలను ప్రస్తావించగా.. జీఎం సానుకూల స్పందన లభించినట్లు ఎంపీ వివరించారు. ఆదిలాబాద్ - గడ్‌చందూర్ మార్గం డీపీఆర్, అంచనా నివేదిక డిసెంబర్ 24లోగా రైల్వేబోర్డుకు ఇస్తామని, ఆదిలాబాద్‌కు రూ.17.76 కోట్లు, బాసరకు రూ.11.33 కోట్లు కేటాయించి అమృత్ స్టేషన్లుగా ఆధునికీకరిస్తామని అధికారులు సమాధానమిచ్చారని పేర్కొన్నారు. బల్హర్షా-కాజీపేట మార్గంలో రైల్వే ఓవర్‌బ్రిడ్జి, ముత్ఖేడ్ - పింపల్‌కుటి వరకు డబుల్‌లైన్ సర్వే చేసేందుకు చర్యలు తీసుకునేలా కోరినట్లు తెలిపారు. నాందేడ్, నాగ్‌పూర్ నుంచి తపోవన్, రాజారాణీ, పుణె-నాందేడ్, బెంగళూరు, మరఠ్వాడ సంపర్క్, క్రాంతి, పనవేల్, పుణె-నాందేడ్ రైళ్లను ఆదిలాబాద్ స్టేషన్ వరకు పొడిగించేందుకు అధికారులు అంగీకరించారన్నారు. విశాఖపట్నం - సాయినగర్, సికింద్రాబాద్-జైపూర్, రామేశ్వరం-ఓఖా, యశ్వంత్‌పూర్-ఇండోర్, తిరుపతి-అమరావతి, హైదరాబాద్-జైపూర్, తిరుపతి-అకోల నగరాల నడుమ నడిచే 8 రైళ్లు బాసర స్టేషన్‌లో ఆగేలా చూడాలని విన్నవిస్తే జీఎం సానుకూలత వ్యక్తం చేశారని ఎంపీ వివరించారు.

బంగారు దుకాణంలో దొంగతనం

● 5 కిలోల వెండి, రెండున్నర తులాల స్వర్ణం అపహరణ

కుభీరు, న్యూస్‌టుడే : కుభీరులోని "ఆకాశ్" బంగారు దుకాణంలో గురువారం వేకువజామున దొంగతనం జరిగింది. ఎస్సై రవీందర్, బాధితుల కథనం మేరకు.. ద్విచక్రవాహనంపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు దుకాణం ముందు భాగంలోని సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. ఇనుప చువ్వలగేటు, షట్టర్‌ను బద్దలు కొట్టారు. దుకాణం లోపలిభాగంలోని సీసీ కెమెరాలకు నల్లని రంగును స్ప్రే చేశారు. అనంతరం దుకాణంలోని 5 కిలోల వెండి వస్తువులు, రెండున్నర తులాల బంగారం, రూ.45 వేల నగదు ఎత్తుకెళ్లారు. తెల్లవారుజామున స్థానిక విఠలేశ్వరుని ఆలయంలో జరిగే కాగడా హారతికి వెళ్లేందుకు ఆకాష్ కుటుంబ సభ్యులు బయటకు వచ్చారు. దుకాణ ద్వారం తెరిచి ఉండటంతో దొంగతనం జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. సీఐ నైలునాయక్, ఎస్సై రవీందర్ చేరుకుని క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేయించారు. ఆకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.


దొంగతనం జరిగిన దుకాణం ముందు తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఖానాపూర్‌లో ఆహార అధికారి ఆకస్మిక తనిఖీలు

ఖానాపూర్, న్యూస్‌టుడే: నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని జిల్లా ఆహార అధికారి ప్రత్యూష అన్నారు. ఖానాపూర్ పట్టణంలో గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో రాందేవ్ కాస్మెటిక్స్ దుకాణంలో రూ.9 వేలు విలువైన గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. లారీ అడ్డా ప్రాంతంలోని రాణిగారి బిర్యాని దుకాణంలో తనిఖీలు చేపట్టారు. నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెస్టారెంట్‌లు నడపడానికి నిర్వాహకులు అనుమతి తీసుకోవాలని.. లేనిపక్షంలో రూ.5 లక్షలు జరిమానా, 6 నెలలు సీజ్ చేస్తామన్నారు. నమూనాల ఫలితాలు 20 రోజుల్లో వస్తాయని తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పద పద.. తడోబా..


సందడి చేస్తున్న సందర్శకులు



● విహరిద్దాం.. పులులను దగ్గరగా చూసేద్దాం

పెద్ద పులుల గాండ్రింపులు, జింకల పరుగులు, పచ్చని చెట్లు, చక్కని నీటి వనరులు.. వీటన్నింటినీ ఓ సఫారీ జీప్‌లో చూస్తూ అలా ప్రకృతిలో విహరించాలని ఎవరికైనా ఉంటుంది. నిత్యం ఒత్తిళ్లతో సహవాసం చేస్తున్న మనకు ప్రకృతిలో ఒకరోజు సేదతీరేందుకు చక్కటి ప్రాంతం తడోబా అభయారణ్యం. దేశంలో ప్రసిద్ధి గాంచిన అభయారణ్యాలలో ఇది ఒకటి. మహారాష్ట్రలో ఉన్న ఈ ప్రాంతం పులులకు పుట్టినిల్లు. విశాలంగా, అనేక రకాల వన్యప్రాణులకు నెలవైన ఈ అరణ్యాలను చూసేందుకు దేశ విదేశాల నుంచి విశేషంగా పర్యాటకులు తరలి వస్తుంటారు. వర్షాకాలంలో మూడు నెలలు మూసి ఉండగా.. ఇటీవలే తెరిచారు. వందల సంఖ్యలో సందర్శకులు వీక్షిస్తున్నారు.

–న్యూస్‌టుడే, బల్లార్ష


చెరువు వద్ద కూనలతో సేదతీరుతున్న పులి

ఎలా చేరుకోవచ్చంటే..

మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో ఉన్న ఈ అరణ్యం దాదాపు 1727 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉంది. ఇందులో 626 చ.కి.మీ. విస్తీర్ణంలో కోర్ జోన్ ఏర్పాటు చేశారు. అందులో వన్యప్రాణులు సంచరించేందుకు వీలు కల్పించారు. మిగిలిన ప్రాంతమంతా బఫర్ జోన్. రైలు, రోడ్డు, విమాన మార్గాల ద్వారా ఇక్కడికి చేరుకోవచ్చు. కుమురంభీం జిల్లా కేంద్రం నుంచి 120 కి.మీ. హైదరాబాద్ నుంచి 390 కి.మీ.లో దూరం ఉంటుంది. చంద్రపూర్ రైల్వే స్టేషన్ నుంచి వాహనాల సదుపాయం ఉంటుంది. విమాన మార్గంలో నాగపూర్ చేరుకుంటే అక్కడ నుంచి 150 కి.మీ. దూరంలో ఈ ప్రాంతం ఉంటుంది.

రోజులో రెండు సార్లు..



రోజూ ఉదయం 6 గంటలకు పర్యాటకులతో జిప్సీలు బయలు దేరతాయి. లోపల ఉదయం 10 గంటల వరకు సంచరిస్తుంటాయి. మళ్లీ మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం ఆరున్నర గంటల వరకు పర్యటన ఉంటుంది. చరవాణులు, ప్లాస్టిక్ బాటిళ్లు, ప్లాస్టిక్ కవర్లలోని తినుబండారాలను అనుమతించరు.

పులులే ఆకర్షణ..

ఇక్కడ 100కు పైగా పెద్దపులులు, 64 చిరుతలు, ఎలుగుబంట్లు, అడవి బర్రెలు, జింకలు, నెమళ్లు, వివిధ రకాల వన్యప్రాణులు ఉన్నాయి. ఈ అరణ్యాలలో తడోబా, కోడసా అనే ప్రధాన చెరువులతోపాటు అందేరీ నది పరీవాహక ప్రాంతం ఉంటుంది. వన్యప్రాణులు దాహార్తి తీర్చుకునేందుకు సహజసిద్ధమైన కొలనులను సైతం అటవీ అధికారులు ఏర్పాటు చేశారు.

24 రోజుల్లో అయిదు వేల మంది..

అభయారణ్యాలలో ఈ నెల 1వ తేదీ నుంచి పర్యాటకులను అనుమతినివ్వగా.. ఇప్పటి వరకు 5,250 మంది సందర్శించినట్లు అటవీ అధికారులు ప్రకటించారు.

సందర్శన ఇలా..

సందర్శించేందుకు పర్యాటకులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. అభయారణ్యాల లోపలికి ఆరు మార్గాల ద్వారా పర్యాటకులను అనుమతిస్తారు. నాగపూర్ నుంచి వచ్చే వారికి కోలార, చంద్రపూర్ మార్గం గుండా వెళ్లేవారికి మోహర్లీ ద్వారం అనుకూలంగా ఉంటాయి. పర్యాటకుల కోసం మోహర్లీ వద్ద 32, కోలార వద్ద 12, నవేగావ్ వద్ద 6, కుంటవండా 4, జరీ 4, పంగడి 2.. ఇలా 60 ఓపెన్ టాప్ జిప్సీలు ఉంటాయి. ఒక జిప్సీలో ఆరుగురిని మాత్రమే అనుమతిస్తారు. డ్రైవర్‌తోపాటు ఒక గైడ్ ఉంటారు. పర్యాటకుల కోసం ప్రతి ద్వారం వద్ద ప్రత్యేక వసతి గృహాలు ఉన్నాయి. ప్రతి మంగళవారం సెలవు. వారాంతపు రోజుల్లో ప్రతి జిప్సీకి రూ.7,100, మిగిలిన రోజులలో రూ.6,100 ఫీజు వసూలు చేస్తారు.

'మాయా' ప్రత్యేకం

ఇక్కడ మాయా అనే పులిని రారాజుగా పిలుస్తారు. దీన్ని చూసేందుకు ప్రముఖ క్రికెటర్ సచిన్ తెందూల్కర్ ఏటా కుటుంబ సమేతంగా వస్తారు. మూడురోజులపాటు ఇక్కడ సేద తీరుతారు. ఇవే కాక తార, నయనతార అనే పులులు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. తెలుగు సినిమా హీరో నాగ చైతన్య సైతం తరచూ తడోబాను సందర్శిస్తారు.

ఇష్టారాజ్యంగా సోయాల కొనుగోళ్లు


సోయాలను లారీలో నింపిస్తున్న ఓ వ్యాపారి

కుభీరు, న్యూస్‌టుడే : కుభీరులో ఓ సోయా కొనుగోళ్ల వ్యాపారం దళారుల జేబులు నింపుతుండగా, రైతు జేబుకు చిల్లులు పెడుతున్నాయి. మార్కెట్ అధికారుల కళ్లుగప్పి ప్రభుత్వ ఆదాయానికి గండిపెడుతున్నారు. ఓ వ్యాపారి మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు పండించిన పంటను కొనుగోలు చేయాలంటే లైసెన్స్ కలిగి ఉండాలి. సదరు వ్యాపారి నిజామాబాద్ జిల్లా ధర్మారం గ్రామంలోని ఇందూరు ఇంటిదీపం పేరిట లైసెన్స్‌తో కుభీరులో రైతులనుంచి మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు సోయాలు కొనుగోలు చేస్తున్నారు. తూకంలో మూడు కిలోలు కోతపెడుతున్నారు. కొనుగోలు చేసిన సోయాలకు మార్కెట్ ఫీజు చెల్లించకుండానే మహారాష్ట్రకు తరలిస్తున్నారు. గురువారం లారీలో సోయాలు నింపుతుండగా మార్కెట్ అధికారులు అక్కడికి వెళ్లారు. ఇదే విషయమై మార్కెటింగ్‌శాఖ ఏడీని సంప్రదించగా శుక్రవారం సదరు వ్యక్తి చేపడుతున్న సోయా కొనుగోళ్లపై విచారణ చేస్తామన్నారు.

గ్రంథాలయాలకు మంచి రోజులు

● జ్ఞాన తెలంగాణగా తీర్చిదిద్దుతాం ● ఉచిత విద్యుత్తు అందిస్తాం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం : రానున్న మూడు నెలల్లో గ్రంథాలయాలకు మంచి రోజులు వస్తాయని, రాష్ట్రాన్ని జ్ఞాన తెలంగాణగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డా.రియాజ్ స్పష్టం చేశారు. ఉచిత విద్యుత్తు అందించాలని ముఖ్యమంత్రికి నివేదిస్తామని తెలిపారు. వరుస ఉద్యోగ ప్రకటనలతో గ్రంథాలయాలకు నిరుద్యోగ అభ్యర్థులు, పాఠకులు వస్తున్నా వారికి సరైన పుస్తకాలు అందుబాటులో లేవని.. సొంత భవనాలు, విద్యుత్తు, మూత్రశాలలు, తాగు నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని న్యూస్‌టుడే సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన పైవిధంగా సమాధానమిచ్చారు. గురువారం ఆదిలాబాద్‌కు వచ్చిన ఆయనతో 'న్యూస్‌టుడే' ముఖాముఖి నిర్వహించింది.


రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డా.రియాజ్‌తో

ముఖాముఖి

? న్యూస్‌టుడే : కొత్త మండలాల్లో గ్రంథాలయాలు లేవు. పాఠకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు?

డా.రియాజ్ : త్వరలో కొత్త మండలాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తాం. సొంత భవనాల నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ పరిధిలో స్థలాలను పరిశీలిస్తున్నాం.

? లైబ్రేరియన్ల కొరతతో గ్రంథాలయాలు మూసే ఉంటున్నాయి?

ఒక్కో లైబ్రేరియన్ మూడేసి గ్రంథాలయాల బాధ్యతలు చేపడుతున్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో గ్రంథాలయ శాఖలో ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. ఈ విషయం గురించి ముఖ్యమంత్రితో చర్చిస్తాం. రానున్న ఉద్యోగ ప్రకటనలో గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తాం. త్వరలో 33 జిల్లాలకు గ్రంథాలయ సంస్థ ఛైర్మన్లను నియమిస్తాం.

? పోటీ పరీక్షలకు సంబంధించిన కొత్త ముద్రణ పుస్తకాలు సరిపోవడం లేదు.

చిక్కడపల్లి గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు, దిన, వార, పక్ష, మాస పత్రికలు అన్నీ గ్రంథాలయాల్లో ఉండేలా చర్యలు తీసుకుంటాం. కొత్త ముద్రణ పుస్తకాలు అందుబాటులో ఉంచుతాం. దాతలు కూడా సహకరించి పుస్తకాలు అందిస్తున్నారు.

? ఏళ్లుగా సెస్సు నిధులు రాక గ్రంథాలయాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు?

అవును నిజమే. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల నుంచి గ్రంథాలయాలకు రూ.కోట్లలో సెస్సు రావాల్సి ఉంది. గత ప్రభుత్వం వీటి గురించి అసలు ఆలోచించలేదు. మున్సిపాలిటీ, డీపీవో శాఖలతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తాం. రానున్న రోజుల్లో సెస్సు వసూలు చేసి అభివృద్ధి పనులకు కేటాయిస్తాం.

? వరుస ఉద్యోగ ప్రకటనల నేపథ్యంలో గ్రంథాలయాలకు అభ్యర్థుల తాకిడి పెరుగుతోంది. పఠన గదులు సరిపోక అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారు.

నిజమే. ముఖ్యంగా మహిళలకు ప్రత్యేకంగా పఠన గదులు ఏర్పాటు చేస్తాం. అవసరమైన కుర్చీలు, బెంచీలు, ప్యాడ్లు సమకూరుస్తాం.

105 కిలోల గంట ఏర్పాటు

బేల, న్యూస్‌టుడే : బేల మండల కేంద్రంలోని విఠల్, రుకుంబాయి ఆలయ ప్రధాన ద్వారం వద్ద భక్తుడు పండరీనాథ్ 105 కిలోల భారీ గంటను ఏర్పాటు చేశారు. నాలుగేళ్ల కిందట ఇంటి ఆవరణలో సుందర ఆలయాన్ని నిర్మించిన ఆయన గురువారం భారీ గంటతో పాటు కలశాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో హోమం చేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు.


భారీ గంటకు పూజలు చేస్తున్న పండరీనాథ్ కుటుంబ సభ్యులు


కుంటాల ఆదర్శ పాఠశాలలో ఓటు పత్రాలను ప్రదర్శిస్తున్న కృష్ణారావు

సీపీఎస్ రద్దే లక్ష్యంగా పోటీ

నిర్మల్ అర్బన్, కుంటాల : పాత పింఛన్ సాధన, సీపీఎస్ రద్దే లక్ష్యంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు, అభ్యర్థి కృష్ణారావు అన్నారు. గురువారం నిర్మల్ ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులతో సమావేశమై మాట్లాడారు. అధ్యాపకుల సంఘం నాయకులు సత్యపాల్, రేవంత్, ఎల్లన్న, జలజ, పద్మ, శేఖర్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు. కుంటాల ఆదర్శ పాఠశాలలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులతో ఓటు నమోదు చేయించారు.

స్పందించారు.. పారిశుద్ధ్య పనులు చేపట్టారు

వందనం

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని మాంజ్రి గ్రామంలో డ్రైనేజీల్లో మురుగు పేరుకుపోయి పారిశుద్ధ్య పనులు అసంపూర్తిగా ఉన్నాయి. సమస్యను వివరిస్తూ 'ఈనాడు'లో గురువారం 'నిధుల కొరత పడకేసిన పనులు' శీర్షికన కథనం ప్రచురితమయ్యింది. ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్యదర్శి సంతోష్ పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. గత కొన్ని రోజులుగా అవస్థలు పడ్డ గ్రామస్థులు పనులు కొనసాగుతుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.


మాంజ్రిలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న కార్మికులు

హైకోర్టును ఆశ్రయించిన ఆర్జీయూకేటీ పూర్వ విద్యార్థి

ముథోల్(బాసర), న్యూస్‌టుడే : బాసరలోని ఆర్జీయూకేటీలో 2023లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన తనకు యూనివర్సిటీ అధికారులు ధ్రువపత్రాలు ఇవ్వడం లేదంటూ పూర్వ విద్యార్థి సామల ఫణికుమార్ ఈ నెల 22న హైకోర్టును ఆశ్రయించాడు. విద్యార్థి తెలిపిన వివరాల ప్రకారం.. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో ఫీజులు బకాయిలున్నాయని చదువు పూర్తయిన విద్యార్థులకు యూనివర్సిటీ అధికారులు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదు. పై చదువులు, ఉద్యోగాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలుమార్లు విన్నవించినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని వాపోయాడు. ఈ నేపథ్యంలో గురువారం విచారణ చేసిన హైకోర్టు విద్యార్థికి సంబంధించిన వివరాలను తెలుసుకుని ఆర్జీయూకేటీకి నోటీసులు జారీ చేసింది. ఈ విషయమై 'న్యూస్‌టుడే' ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్‌ను సంప్రదించగా తమకు ఎలాంటి నోటీసులు అందలేదన్నారు. కోర్టు నోటీసులు వస్తే వారి ఆదేశాల మేరకు వివరాలను తెలియజేస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

నిర్మల్ 97053 46693
భైంసా 63099 94649
ఖానాపూర్ 96401 62091

?: కుభీర మండలం పార్డి(కె) గ్రామంలో సింగిల్‌ఫేస్ మోటారును మూడు రోజుల క్రితం బోరుబావిలోంచి తీసినా మరమ్మతులు చేయటం లేదు. వెంటనే తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలి. - పార్డి(కె) గ్రామస్థులు

✓: మోటారు, కరెంటు తీగ దెబ్బతిన్నాయి. పైపుకు రంధ్రాలు పడ్డాయి. వీటి మరమ్మతులకు నిధులు లేవు. చేతిపంపు బిగించి తాగునీరు అందించే మార్గం చూస్తాం. - నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి పార్డి(కె) -న్యూస్‌టుడే, కుభీరు

?: ఖానాపూర్ పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలోని వాణిజ్య సముదాయం వెనుక గల్లీలో డ్రైనేజీ లేక మురుగునీరు రహదారిపైనే పారుతోంది. -హరికృష్ణ, వ్యాపారి

✓: స్వచ్ఛత పనులు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం. -ఎం.శంకర్, మున్సిపల్ శానిటేషన్ ఇన్‌ఛార్జి -న్యూస్‌టుడే, ఖానాపూర్

ఎల్‌ఆర్‌ఎస్ పరిశీలనలో వేగం పెంచాలి

నిర్మల్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. సంబంధిత అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయికి వెళ్లి దరఖాస్తులను పకడ్బందీగా పరిశీలన జరపాలన్నారు. రోజు వారీగా పరిశీలించిన దరఖాస్తుల వివరాలను అధికారులకు అందజేయాలన్నారు. సీఎం విశ్వకర్మ పథకానికి వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిశీలించాలన్నారు. ముఖ్యంగా పెంపకానికి నర్సరీలను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు పాలనాధికారి ఫైజాన్ అహ్మద్, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, ఎల్డీఎం రామ్‌గోపాల్, జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.



కొలువుదీరిన భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం ప్రతినిధులు

పాలకవర్గం ప్రమాణ స్వీకారం

భైంసా, న్యూస్‌టుడే : భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం గురువారం కొలువు దీరింది. కొత్త కమిటీని నియమిస్తూ ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు గాంధీగంజ్‌లోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఉన్నత శ్రేణి కార్యదర్శి పురుషోత్తం నాయక్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, డైరెక్టర్లతో ప్రమాణం చేయించారు. ఛైర్మన్‌గా సిందే ఆనంద్‌రావు పటేల్, వైస్ ఛైర్మన్‌గా ఎండీ.ఫారుఖ్ అహ్మద్, డైరెక్టర్లుగా డి.రామేశ్వర్, సదిమోళ్ల భూమన్న, షేక్ మౌలానామియా, తోట రాము, రాథోడ్ రామ్‌నాథ్, జాదవ్ సుశీల, గడ్డోజి దేవిదాస్, సట్ల కిష్టన్న, మాధవ్‌రావు, అల్లాపూర్ సుధాకర్‌రావు, కుంట్లోల్ల విఠల్, కడం దత్తరాం పటేల్ ప్రమాణ స్వీకారం చేశారు. ద్వితీయ శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు మురళీగౌడ్, సంతోష్‌రెడ్డి, అహ్మద్ సాజిద్, కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులు, ఆగ్రోడీలర్లు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు పోలీస్ శాఖపై అవగాహన

నిర్మల్ గ్రామీణం, న్యూస్‌టుడే : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం నిర్మల్ గ్రామీణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ప్రిన్స్, విజయ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఆయుధాలు, బాంబు డిస్పోజల్, సామగ్రి, పోలీస్ జాగిలాల ప్రదర్శన, వాటి వినియోగంపై డీఎస్పీ గంగారెడ్డి అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100 నంబరును వినియోగించుకోవాలన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. నిర్మల్ గ్రామీణ సీఐ రామకృష్ణ, ఎస్సై లింబాద్రి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

ముథోల్: ముథోల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. సీఐ మల్లేశ్, ఎస్సై సాయికిరణ్‌లు ఆయా శాఖలు, పాఠశాలల విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌ను చూపించి ఆయుధాలపై అవగాహన కల్పించారు.

ఆర్థిక తోడ్పాటుకు సీఎం సహాయ నిధి

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్న వారికి తోడ్పాటుగా నిలుస్తోందని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు



అందజేసిన చెక్కులతో లబ్ధిదారులు, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, నాయకులు

అన్నారు. గురువారం నిర్మల్‌లోని ఆయన నివాస గృహం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మంజూరైన చెక్కులను అందజేసి మాట్లాడారు. వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్స పొంది ఆర్థిక భారం భరించలేక సీఎం ఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న వారందరికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సదరు నిధులను మంజూరు చేస్తున్నారని చెప్పారు. నిర్మల్ పట్టణం, సారంగాపూర్, లక్ష్మణచాంద, సోన్, మామడ మండలాలకు చెందిన పలువురికి మంజూరైన రూ. 5.70 లక్షల చెక్కులు ఇచ్చామని వెల్లడించారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ సోమ భీంరెడ్డి, దేవరకోట ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్, నాయకులు చిన్ను, రాజేశ్వర్, సంతోష్‌సోనియా పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలి

నిర్మల్, న్యూస్‌టుడే : అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశంహాలులో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా అదనపు పాలనాధికారి (రెవెన్యూ) కిషోర్‌కుమార్, డీఆర్వో భుజంగ్‌రావు, జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి, మాధ్యమిక జిల్లా విద్యాధికారి పరశురాం, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాస్, పాల్గొన్నారు.

కాలం దాటింది.. కష్టాలు తీరేనా..

● సిరాల ప్రాజెక్టు పనులెప్పుడో

న్యూస్‌టుడే, భైంసా : గత ఏడాది జులై 29న కురిసిన భారీ వర్షాలకు భైంసా మండలంలోని సిరాల ప్రాజెక్టు ఆనకట్ట పూర్తిగా, కాలువ రెండు చోట్ల తెగిపోయాయి. దీని కింద నిర్మించిన సిరాల కొత్త చెరువుకు సైతం పెద్ద గండి పడింది. దీంతో అయిదు గ్రామాల శివారులోని సుమారు 1,500 ఎకరాలకు సాగు నీరందకుండా పోయింది. ఫలితంగా ఆయకట్టు భూములన్నీ బీళ్లుగా మారాయి. ఇప్పటికే మూడు పంటల కాలంలో నీరందక రైతులు తీవ్రంగా నష్ట పోయారు. ఇది ఇలా ఉంటే తెగిన ప్రాజెక్టును పునరుద్ధరించేందుకు అధికారులు రూ. 15.49 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. కాగా గత మార్చి నెలలో ప్రభుత్వం రూ. 12.59 లక్షలు మంజూరు చేస్తూ ఆర్థిక, పరిపాలన అనుమతులు ఇచ్చింది. దీంతో అధికారులు వెంటనే టెండర్లు పిలిచారు. ఆలోపే పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో టెండర్లు తెరిచే వీలు లేకుండా పోయింది. అనంతరం టెండర్లు తెరవగా ఓ గుత్తేదారు 12.8 శాతం తక్కువతో పనులు దక్కించుకున్నారు. తరువాత ఒప్పందంలో జాప్యం కావడం, వానాకాలం సమీపించడంతో పనులకు నోచుకో



తెగిన సిరాల చెరువు కట్ట

లేదు. ప్రస్తుతం వానాకాలం గడిచి పోగా పనులు చేపట్టేందుకు సమయం ఆసన్నమైంది. త్వరితగతిన పనులు ప్రారంభిస్తే వచ్చే వానాకాలానికి సాగు నీరందే అవకాశం ఉందని, సాగు నీటి కష్టాలు తీరుతాయని రైతులు ఆశ పడుతున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం

టెండరు ప్రక్రియ పూర్తయ్యింది. నిర్మల్‌కు చెందిన గుత్తేదారు పనులు దక్కించుకున్నారు. ఒప్పంద పత్రాలు పూర్తయ్యాయి. పనులు త్వరలో ప్రారంభిస్తాం. వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తి స్థాయిలో సాగు నీరందించేందుకు చర్యలు తీసుకుంటాం.

- అనిల్ జాదవ్, డీఈఈ, నీటిపారుదల, భైంసా

రైతులకు అండగా ఉంటాం

● భారాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

నిర్మల్, న్యూస్‌టుడే : ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతన్నకు అండగా ఉంటామని, వారికి అన్యాయం జరిగితే పోరాటం చేస్తామని భారాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. గురువారం ఆదిలాబాద్‌లో నిర్వహించిన బహిరంగసభలో పాల్గొని తిరుగు ప్రయాణంలో జిల్లా కేంద్రంలోని మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి-రాంకిషన్‌రెడ్డి నివాసంలో తేనీరు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో ఇథనాల్ పరిశ్రమను జనావాసాలకు, నీటికి దూరంగా ఉండేలా స్థలం ఎంపిక చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దిలావర్‌పూర్-గుండంపెల్లి గ్రామాల మధ్య ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో రైతులకు, ప్రజలకు నష్టం జరుగుతుందని, ఈ విషయమై ప్రభుత్వంతో పోరాడుతామని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్, నాయకులు

పార్టీని వీడినా నష్టం లేదు..

పదేళ్ల పాటు పదవులు అనుభవించి తమ ఆస్తులు, ప్రయోజనాలు కాపాడుకునేందుకు నిర్మల్, ముథోల్‌కు చెందిన నేతలు పార్టీని వీడినా ఎలాంటి నష్టం ఉండదని మాజీ మంత్రి ఐకేరెడ్డి, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిలను ఉద్దేశించి అన్నారు. భారాసలో నిబద్ధత ఉన్న నాయకులు, కార్యకర్తలు, సైనికులు ఉన్నారని, రానున్న రోజుల్లో పార్టీలో ఉన్న వారందరికీ మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాకముందే ఆ పార్టీని అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ నియోజకవర్గ భారాస ఇన్‌ఛార్జి జాన్సన్ నాయక్, పార్టీ నిర్మల్ నియోజకవర్గ సమన్వయకర్త రాంకిషన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా జడ్పీ మాజీ ఛైర్మన్ శ్యాంసుందర్, పట్టణాధ్యక్షుడు రాము, నాయకులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

ప్లాస్టిక్ పరిశ్రమ నిలిపి వేయాలని ఆందోళన

పెంబి, న్యూస్‌టుడే : మండలంలోని ఇటిక్యాల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ప్లాస్టిక్ డబ్బాల తయారీ పరిశ్రమ వద్ద గ్రామస్థులు గురువారం ఆందోళనకు దిగారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఈ పరిశ్రమను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమ ఏర్పాటుతో గాలి తీవ్రంగా కలుషితం అవుతుందని గ్రామస్థులు వాపోయారు. మహేందర్, ఎల్లయ్య, సమ్మిరెడ్డి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : లయన్స్ క్లబ్ నిర్మల్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ చేపట్టారు. గురువారం నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయపు నడక, వ్యాయామం కోసం వచ్చిన వారిని కలిసి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు మాట్లాడుతూ.. జన్యుపరంగా వచ్చేవి కొన్ని, అలవాట్లతో వచ్చే క్యాన్సర్ వ్యాధులు చాలా ఉన్నాయని తెలిపారు. తీసుకునే ఆహారం విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. లయన్స్ క్లబ్ నిర్మల్ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్, కోశాధికారి లక్ష్మీనారాయణగౌడ్, కార్యక్రమ ఛైర్మన్ హనుమంతు, జోన్ ఛైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ప్రదర్శిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు, వైద్యులు



నిర్మల్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

నల్లబ్యాడ్జీలతో నిరసన

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే : సికింద్రాబాద్‌లో ఈ నెల 14న జరిగిన ఘటనలో ముత్యాలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం పట్ల సనాతన ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి స్థానిక శివాజీచౌక్‌లో గురువారం ప్లకార్డులు ప్రదర్శించారు. సంఘ బాధ్యుడు మెడిసెమ్మె రాజు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి దోషులను కఠినంగా శిక్షించాలని, ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

లోకేశ్వరం: సికింద్రాబాద్‌లో ముత్యాలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలని భాజపా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పార్టీ మండల అధ్యక్షుడు జయసాగర్ అధ్యక్షతన లోకేశ్వరంలో సమావేశమయ్యారు.

ఘనంగా భీమన్న గంగస్నానం

ఖానాపూర్, న్యూస్‌టుడే : పట్టణంలోని భీమన్న దేవుడి ఉత్సవాల్లో భాగంగా గురువారం భీమన్న దేవుడి గంగస్నానం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాంనగర్ కాలనీ నుంచి భీమన్న గజాలతో తప్పెట చప్పుళ్ల మధ్య గోదావరి వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గజాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గంగస్నానానికి తరలిన భీమన్న దేవుడు, భక్తులు

పురుగుమందు తాగి వృద్ధుడి బలవన్మరణం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : భైంసా మండలం తిమ్మాపూర్‌కు చెందిన వృద్ధుడు పన్నాల రాంరెడ్డి(80) ఆదిలాబాద్ పట్టణ శివారులో పురుగు మందు తాగి రిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మావల ఎస్‌ఐ విష్ణువర్ధన్ వివరాల మేరకు.. పన్నాల రాంరెడ్డి దిలావర్‌పూర్‌కు వెళ్తానని ఇంట్లో చెప్పి సోమవారం ఉదయం బయలు దేరాడు. మంగళవారం ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు భైంసా గ్రామీణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. అతడు ఆదిలాబాద్ పట్టణ సమీపంలోని మావల హరితవనం వద్ద అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని మంగళవారం సాయంత్రం గమనించిన టైగర్ గ్రూప్ సభ్యులు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మావల పోలీసులు విస్తృతంగా ప్రచారం చేయటంతో ఆయన కుటుంబ సభ్యులు గుర్తించి బుధవారం సాయంత్రం రిమ్స్‌కు చేరుకున్నారు. చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. కొంత కాలంగా అతడు బోన్ క్యాన్సర్‌తో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది పురుగుమందు తాగినట్లు కుమారుడు ముత్యంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



రాంరెడ్డి

నేర వార్తలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సారంగాపూర్, న్యూస్‌టుడే : మండలంలోని జామ్ గ్రామానికి చెందిన తుల చిన్నయ్య(42) గురువారం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వారం రోజుల క్రితం చరవాణి విషయంలో స్థానికులు చిన్నయ్యను తీవ్రంగా కొట్టారు. ఆ దెబ్బల కారణంగానే అతను మృతిచెందాడని మృతుని మామ రాజేశ్వర్ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అతని ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సారంగాపూర్ ఎస్సై సల్ల శ్రీకాంత్ తెలిపారు. శవ పంచనామ నిమిత్తం మృతదేహాన్ని నిర్మల్ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

అక్రమ కలప పట్టివేత

సారంగాపూర్, న్యూస్‌టుడే : అక్రమంగా నిల్వ ఉంచిన టేకు దుంగలను పట్టుకున్నట్లు సారంగాపూర్ ఉప అటవీ అధికారి మహ్మద్ నజీర్‌ఖాన్ తెలిపారు. మండలంలోని పొట్య గ్రామంలో అక్రమ కలప ఉందనే సమాచారంతో గురువారం సిబ్బందితో కలిసి గ్రామంలో సోదాలు నిర్వహించగా రూ. 30 వేల విలువైన టేకు దుంగలు లభ్యమైనట్లు చెప్పారు. వాటితో పాటు రెండు కర్ర కోత యంత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. బాధితులపై కేసు నమోదు చేసి స్వాధీనం చేసుకున్న టేకు దుంగలు, యంత్రాలను సారంగాపూర్‌లోని అటవీ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. సోదాల్లో ఎఫ్‌బీవోలు సుజాత, వెన్నెల, స్వప్న తదితరులు ఉన్నారు.



పట్టుకున్న కలప దుంగలతో ఉప అటవీ అధికారి నజీర్‌ఖాన్

సైలెన్సర్ మార్చిన వాహనాల సీజ్

భైంసా: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి సైలెన్సర్లను మార్చిన ఏడు వాహనాలను పట్టణ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ గోపినాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొందరు కంపెనీ సైలెన్సర్ తొలగించి నిబంధనలకు విరుద్ధంగా అతి పెద్ద శబ్దం వచ్చే సైలెన్సర్లను బిగించి వాహనాలు నడుపుతుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మేరకు వాటిని సీజ్ చేసి రూ.వెయ్యి జరిమానా విధించామని పేర్కొన్నారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

కుంటాల : అప్రమత్తతతోనే సైబర్ నేరగాళ్లకు అడ్డుకట్ట వేయవచ్చని ఏఎస్సై రాందాస్, దేవ్‌రావు అన్నారు. మండలంలోని కల్లూరులో గురువారం అవగాహన కల్పించారు. అనంతరం జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు.

ఆటలతో ఉజ్వల భవిష్యత్తు

దిలావర్‌పూర్, న్యూస్‌టుడే : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే తమకు నచ్చిన ఆటల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మండల విద్యాధికారి శంకర్ అన్నారు. గురువారం మండలంలోని గుండంపల్లి ప్రభుత్వ పాఠశాలలో అండర్-17 బాలికల వాలీబాల్ జోనల్ స్థాయి ఎంపిక పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గుండంపల్లి పాఠశాల నుంచి నందిని, శ్రీ నిత్య, సంజన, రేష్మ, జోనల్ స్థాయికి ఎంపిక కావడంతో వారిని అభినందించారు.



గుండంపల్లిలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ శంకర్

తెలంగాణ క్రికెట్ సూపర్‌లీగ్‌లో వడ్యాల్ యువకుడు

లక్ష్మణచాంద, న్యూస్‌టుడే : తెలంగాణ క్రికెట్ సూపర్‌లీగ్ (టీసీఎస్‌ఎల్)లో వడ్యాల్ గ్రామానికి చెందిన యువకుడు రామ్‌రాజు ఎంపికయ్యాడు. గురువారం హైదరాబాద్‌లో టీసీఎస్‌ఎల్ లీగ్‌కు సంబంధించి నిర్వహించిన వేలంలో జట్టు ప్రతినిధులు యువకున్ని ఎంచుకున్నారు. హైదరాబాద్ ప్రొఫెషనల్ క్రికెటర్స్ చాలా మంది వేలంలో పోటీ పడగా యువకుడు స్పిన్ విభాగంలో ప్రతిభ కారణంగా ప్రతినిధులు మొగ్గు చూపారు. రామ్‌రాజు బీపెడ్ పూర్తిచేసి ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలలో పీఈటీ పనిచేస్తూనే.. నిర్మల్ జిల్లా టీసీఏ కోచ్‌గా పలువురు విద్యార్థులకు క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి క్రికెట్ పోటీల్లో స్పిన్‌బౌలింగ్‌తో ఆకట్టుకోవటంతోనే సూపర్‌లీగ్‌లో ఆడే అవకాశం దక్కింది. టీసీఎస్‌ఎల్‌కు ఎంపికైన రామ్‌రాజును గ్రామస్థులు అభినందించారు.



రామ్‌రాజు

పుస్తక పఠనంతో విజ్ఞానం

కుంటాల, పెంబి, న్యూస్‌టుడే : పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని మండల విద్యాధికారి వాటోలి ముత్యం అన్నారు. రూం టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని లింబా(కె) ప్రాథమిక పాఠశాలలో ఆదర్శ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఎంఎన్‌ఓ రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయులు సతీష్, రవీందర్, ఏపీసీ ఛైర్మన్ అనిత, సంస్థ మండల సమన్వయకర్త రాము తదితరులు పాల్గొన్నారు. పెంబి ప్రాథమిక పాఠశాలలో రూమ్ టూ రీడ్ అనే స్వచంద సంస్థ ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని తహసీల్దార్ లక్ష్మణ్ ప్రారంభించారు. ఎంపీడీఓ రమాకాంత్, ఎంఈఓ రాంచందర్, ఎస్సై సాయికుమార్, సంస్థ ప్రతినిధి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



పెంబిలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ లక్ష్మణ్

నిత్య హాజరుతోనే ఉత్తమ మార్కులు

లోకేశ్వరం: నిత్యం తరగతులకు హాజరవుతూ శ్రద్ధగా చదువుకుని పరీక్షలలో మంచి మార్కులు తెచ్చుకోవాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరుశురాం నాయక్ విద్యార్థులకు సూచించారు. గురువారం ఆయన లోకేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించడంతో పాటు పలు సూచనలు చేశారు. ప్రిన్సిపల్ గౌతం, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

నిర్మల్ అర్బన్ : నిర్మల్‌లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సి.లింగన్న తెలిపారు. హైదరాబాద్ గ్లోబల్ కంటి ఆసుపత్రి వైద్యులు హాజరై పరీక్షించి, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయనున్నారని పేర్కొన్నారు.

ఉపాధిహామీ గ్రామసభ

లక్ష్మణచాంద : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో రాధ ఆధ్వర్యంలో ఉపాధిహామీ గ్రామసభను నిర్వహించారు. 2025-26 సంవత్సరానికి గాను నిర్వహించే పనులపై ప్రణాళికలు సిద్ధం చేశారు. గ్రామంలో ప్రజలకు ఉపయోగపడే పనులు గుర్తించాలని సూచించారు.

నిఘా నేత్రాల ఏర్పాటు

నర్సాపూర్ (జి) : ప్రధాన కూడళ్లలో, ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ హన్మాండ్లు సూచించారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరించారు. స్పందించిన రాంపూర్, నర్సాపూర్(జి) గ్రామస్థులు రామాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

నూతన కార్యవర్గం..

తానూరు(భైంసా) : ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు ఉద్యమించాల్సిన అవసరం ఉందని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షుడు శంకర్ చంద్రే అన్నారు. తానూరులోని బుద్ధవిహార్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణపై వివరించారు. అనంతరం తానూరు మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా భద్రే సాయినాథ్, అధ్యక్షుడిగా పవార్ అంబాదాస్, ఉపాధ్యక్షులుగా వాగ్మారే గంగాధర్, బన్సోడే గంగాధర్, లోకండే నాగోరావు, మద్నూరే గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా దయానంద్, సంయుక్త కార్యదర్శిగా సాయినాథ్, శేషారావు, కోశాధికారులుగా నగేశ్, భీంరావు ఎన్నికయ్యారు.

కుభీరు: మండలంలోని గ్రామాభివృద్ధి నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె. రాజన్న మరో 30మంది సభ్యులుగా ఎన్నికయ్యారు.

పంట ఉత్పత్తులను రోడ్లపై ఆరబెట్టొద్దు

కుంటాల: రైతులు పంట ఉత్పత్తులను రహదారులపై ఆరబెట్టొద్దని ఎస్సై సీహెచ్. భాస్కరచారి అన్నారు. మండలంలోని అందకూర్ శివారులో గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కల్లూరు-కుంటాల, ఓలా-కుంటాల ప్రధాన రహదారులపై పంటలను వేయడంతో ప్రయాణికులకు, చోదకులకు ఇబ్బందికరంగా మారి ప్రమాదాలు చోటు చేసుకునే ఆస్కారముందన్నారు.

జీఓ 29ను రద్దు చేయాలని డిమాండ్

కడెం : ప్రభుత్వం అమలులోకి తెచ్చిన జీవో 29ను రద్దు చేయాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కడెంలో సమావేశమైన ఆయా సంఘాల నాయకులు జీఓ 29తో అగ్రవర్ణాలకు మేలు కలుగుతుందని, దాన్ని రద్దుచేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, నేతకాని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్, బీఎస్పీ ఖానాపూర్ ఇన్‌ఛార్జి గంగారాం, నాయకులు పాల్గొన్నారు.

ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణపై హర్షం

భైంసా: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒప్పంద ఉద్యోగులుగా విద్యాబోధన చేస్తున్న అధ్యాపకులను ప్రభుత్వం క్రమబద్ధీకరించడంతో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వినోద్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

వినతులు

నిర్మల్ అర్బన్: అంగన్‌వాడీలకు రావాల్సిన వేతన బకాయిలు మంజూరు చేయించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు అన్నారు. గురువారం నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నివాస గృహంలో సిబ్బందికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జిల్లా కార్యదర్శి లలిత, కోశాధికారి శైలజ, సహాయ కార్యదర్శి భాగ్య, నాయకులు సునీత పాల్గొన్నారు.

నిర్మల్ పట్టణం : ఇటీవల జిల్లాలో చేపట్టిన ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియను పునః పరిశీలించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌నాయక్ కోరారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

నర్సాపూర్(జి) : రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలని వ్యవసాయ అధికారి రాంచందర్ నాయక్ సూచించారు. మండల కేంద్రంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో గురువారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

ఘనంగా ఐరాస దినోత్సవం

కుంటాల, న్యూస్‌టుడే : కుంటాలలోని శాంతినికేతన్ పాఠశాలలో గురువారం ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ సంతోష్, సంచాలకుడు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



ఐరాస చిత్రపటాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు